క్లుప్తంగా

పులివెందులకు వెళ్లి పింఛన్ పంపిణీ


బాధితునికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజ్‌నగర్‌కు చెందిన వలంటీర్లు షామీర్, కార్తీక్ పులివెందల ఆయుర్వేదిక్ ఆస్పత్రికి వెళ్లి ఓ వృద్ధుడికి గురువారం ఫింఛన్ పంపిణీ చేశారు. త్యాగరాజ్‌నగర్‌కు చెందిన పింఛన్‌దారుడు జయరామిరెడ్డి పులివెందుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దాదాపీర్ సహకారంతో వలంటీర్లు పులివెందులకు వెళ్లి ఆయనకు పింఛన్ పంపిణీ చేశారు. వలంటీర్లను సచివాలయ సిబ్బంది, స్థానికులు అభినందించారు.

సచివాలయం తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతి

పరిగి: పీ నరసాపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సరస్వతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమై పలు అంశాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు, ఎస్‌డీజీ గోల్స్, డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్, ఎన్‌సీడీసీడీ సర్వే, జీజీఎంపీ వర్క్, ఆయుష్మాన్ భారత్, పీఎం హౌసింగ్ తదితర పథకాలు, సర్వేలను నిర్దేశిత సమయాల్లోనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో జాలప్ప, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న ఆనంద్‌రెడ్డి దంపతులు

గోరంట్ల: కరావులపల్లిలో కరావులీశ్వర ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన రేపటి నారాయణరెడ్డి కుమారుడు ఆనంద్‌రెడ్డి, ఆయన భార్య వసుధరెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. మొత్తాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, గంపల వెంకటరమాణారెడ్డి, బూదిలి లోకేష్, మేకల రంగప్ప, రేపటి రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, చింతా కృష్ణారెడ్డిలకు అందజేశారు. ఈసందర్భంగా ఆనంద్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

అర్హులకు పట్టాలివ్వండి

పెనుకొండ: పట్టణంలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నంబర్ 668 పేదలకు పట్టాలు ఇవ్వడానికి అనువుగా ఉందన్నారు. నాయకులు హరి, రమేష్, బాబావలి, తిప్పన్న, వజ్రం నాగప్ప, సనావుల్లా, బాబా, శోభన్, రవి, అంజినేయులు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెంచీల వితరణ

పరిగి: పరిగి పీహెచ్‌సీకి స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, దాత పరిగి వేణుగోపాలరావు 5 సిమెంట్ బెంచీలను వితరణగా ఇచ్చారు. గురువారం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి సమక్షంలో ఆవరణంలో ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా వేణుగోపాలరావును సన్మానించారు. మెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, ఫార్మసిస్టు ఇనాయతుల్లా, ల్యాబ్ టెక్నీషియన్ వహీదాబేగం పాల్గొన్నారు.

రీ సర్వేకు గ్రామాల ఎంపిక

పుట్టపర్తి అర్బన్: రీసర్వేకు గోరంట్ల మండలంలోని 5 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో రీ సర్వే అధికారులకు గ్రామాల వివరాలను అందజేశారు. రెండో విడతలో భాగంగా గోరంట్ల మండలం పులేరు, మేరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, జక్కసముద్రం, భూగానిపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

- మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


జంబులబండలో సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నవరత్నాల పథకం కింద గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. గురువారం మండలంలోని జంబులబండ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు, స్థానిక సర్పంచ్ నరసమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా, లేదా అని లబ్ధిదారులతో ఆరాతీశారు. ఒక వేళ అందకపోతే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే ప్రభుత్వ ఇళ్ళు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. పొలాలకు వెళ్లే రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు కోరారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ లబ్ధి..

ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. గత మూడేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి అర్హత బట్టి రూ.75 వేల వరకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన చంద్రబాబు.. మరోసారి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఏ ఒక్క పని ప్రజలు గుర్తుండిపోయేలా చేయలేదన్నారు. అందువల్ల బాబును ప్రజలు తిరస్కరించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారన్నారు. అర్హత ఉంటే చాలు, పార్టీలు, కుల మతాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్ వచ్చేది కాదన్నారు. జన్మభూమి కమిటీలు టీడీపీ వారికే పింఛన్ మంజూరు చేయించే వారన్నారు. జంబులబండ గొల్లహట్టిలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్ ఫర్సన్ డాక్టర్ నళిని, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, తహసీల్దార్ నాగభూషణం, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ఏపీఎం ముత్యాలప్ప, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ రంగస్వామి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, ఎస్సీ సెల్ కన్వీనర్ పాండు, రమేష్, నాయకులు తిప్పేస్వామి, గిరిధర్, ఈరన్న, శివకుమార్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా భగీరథ మహర్షి జయంతి

పెనుకొండ రూరల్: మావటూరులో గురువారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భగీరథుడి చిత్రపటానికి పూజలు చేపట్టారు. అనంతరం చిత్రపటాన్ని వెండి రథంపై పురవీధుల్లో ఊరేగించారు.

ఘర్షణ ఒకరికి గాయాలు

రొద్దం: తురకలాపట్నంలో గురువారం జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కర్మకాండ కార్యక్రమంలో వేణు, విజయ్ మధ్య గొడవ జరిగింది. తాగిన మైకంలో విజయ్ వేణుపై వేటకొడవలితో దాడి చేయబోయాడు. ఈక్రమంలో ఇద్దరికీ సర్దిచెబుతున్న వినోద్‌కు కొడవలి తగిలి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి గ్రామంలో విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మట్కా బీటర్ల అరెస్టు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట, కొత్తపల్లి క్రాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

మడకశిర: వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. గురువారం మార్కెట్ యార్డు కార్యాలయంలో పాలకవర్గం సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో మార్కెట్‌యార్డు అభివృద్ధిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బజార్ నిర్వహించడానికి కృషి చేస్తానని తెలిపారు. పశువుల సంత ఏర్పాటుకు, కోల్డ్ స్టోరేజీ, అద్దె గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి, అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రమణారెడ్డిని సన్మానించారు. సమావేశంలో మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ జయరామప్ప, వైస్ చైర్మన్ బాబురెడ్డి, కార్యదర్శి నాగేంద్ర కుమార్, కమిటీ సభ్యుడు శివన్న తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం


శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర : పట్టణంలోని కోట వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేంకటరమణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, ధ్వజారోహణ, శ్రీవారి ఉత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోట వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి


జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి సుప్రభాత సేవతో పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న జయంతి ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం అనంతరం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పుష్పాలంకరణ, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పూల జ్యోతులను తలపై ఎత్తుకుని మేళతాళాలు డప్పుల వాయిద్యాలతో ఆలయానికి చేరుకుని స్వామికి సమర్పించారు. అలాగే అర్చనలు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహా మంగళ హారతి అందించి భక్తులకు తీర్థ ప్రసాదాలు తోపాటు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ నరసింహ ఉత్సవమూర్తులను ముత్యాల పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలు డప్పుల వాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆలయంలో పురోహితులు హోమం, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠాపురం, రేకులకుంట గ్రామాల్లో లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి


మధూడిలో రాగిపంటను పరిశీలిస్తున్న రమణారెడ్డి తదితరులు

మడకశిర (అగళి): వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ రమణారెడ్డి తెలిపారు. ఆయన గురువారం అగళి మండలంలోని మధూడిలో మండల అగ్రి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభ మవుతుందన్నారు. రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అర్హులైన రైతులకు సబ్సిడీ పథకాలను సక్రమంగా అందించాలన్నారు. విధి నిర్వహణలో ఆర్బీకే సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమావేశం ముగిసిన తర్వాత ఆయన మధూడిలో రాగిపంట పరిశీలించారు. సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, అగళి, మడకశిర అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్లు సూర్యనారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, ఏడీఏ కృష్ణ మీనన్, మార్కెట్‌యార్డు చైర్మన్ జయరామప్ప, ఏఓ శేఖర్‌నాయక్, సర్పంచు శివకుమార్, ఎంపీటీసీ, స్థానిక మాజీ జెడ్పీటీసీ శివన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

రొళ్ల: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కవిత తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కవిత మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు–నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. ఐసీడీఎస్, విద్యాశాఖ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రత్నగిరి ఎంపీటీసీ జగదీష్‌బాబు గత ఆరు నెలలుగా తాము నివాసం ఉంటున్న ప్రాదేశాలకు మంచి నీళ్ల సరఫరా కాలేదని, ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నామని అధికారుల దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీ నాగరాజు, ఎంపీడీఓ రామారావు, డీటీ భాగ్యలక్ష్మీ, ఎంఈఓ శ్రీధర్, ఏపీఓ నాగరాజు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం టౌన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మంజూరైన 6067 ఇళ్లల్లో ఆప్షన్–1, ఆప్షన్–2, ఆప్షన్–3, స్కాటర్డ్ ఇళ్లల్లో 147 మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. మెప్మా సిబ్బంది, వెల్ఫేర్, ఎమినిటీ సెక్రటరీలు, వలంటీర్లతో పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి నవంబర్‌లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈఈ నీరజ, హౌసింగ్ ఏఈ ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం బయలుదేరిన ప్రత్యేక బస్సులు

హిందూపురం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం నాలుగు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ప్రయాణికులతో గురువారం బయలుదేరాయి. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద డిపో మేనేజర్ శ్రీనివాసరావు బస్సులను ప్రారంభించారు. హిందూపురం నుంచి బయలుదేరిన బస్సులు శుక్రవారం ఉదయం 3 గంటలకు అరుణాచలం చేరుతాయన్నారు. గిరి ప్రదక్షిణ తర్వాత మధ్యాహ్నం 2గంటలకు తిరిగి బయలుదేరి శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కాణిపాకం శ్రీసిద్ధి వినాయకుని దర్శించుకుని మరుసటి రోజు 4గంటలకు హిందూపురం చేరుతాయన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా


యూరంగాపురం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

మడకశిర: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నందర్భంగా నియోజకవర్గంలోని సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. ఆయన గురువారం మడకశిర మండలం యూరంగాపురం, గౌరీపురం, అగళి మండలం పీబ్యాడిగెర చెక్ పోస్టులను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో ఈచెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా పెట్టినట్లు తెలిపారు. కర్ణాటకలో ఎన్నికల పోలింగ్ ముగిసే వరకు చెక్‌పోస్టులు కొనసాగుతాయన్నారు. మద్యం సరఫరా కాకుండా ఈచెక్‌పోస్టుల్లో నిఘా పెట్టినట్లు తెలిపారు. సీఐ సురేష్‌బాబు, అగళి, మడకశిర ఎస్ఐలు లావణ్య, సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

అమరాపురం: మండల సరిహద్దులోని వీ ఆగ్రహారంలో గురువారం ఉదయం సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు, వివిధ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, బాల్యవివాహాలు, సహజ మరణాలు తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో అనుమానితులు, రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మాట్కా, జూదం, మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడకశిర, అగళి, గుడిబండ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జేడీఎస్‌లో పలువురి చేరిక

పావగడ: స్థానిక విధాన సభ ఎన్నికలు దగ్గర కొస్తున్న కొద్దీ చేరికల ప్రక్రియ ఊపందుకుంటోంది. పట్టణంలోని 16 వ వార్డు శాంతినగర్‌కు చెందిన నరసింహ, మణి, పవన్, రామాంజి, యశ్వంత్ కాంగ్రెస్ పార్టీ నుంచి గురువారం జేడీఎస్‌లోకి చేరారు. జేడీఎస్ పట్టణ విభాగం అధ్యక్షుడు గడ్డం తిమ్మరాజు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చలివేంద్రం ఏర్పాటు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించి తొలిరోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం

రొళ్ల: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 20 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం సాయంత్రం ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. కె.బ్యాడిగెర గ్రామ సమీపంలోని కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్టు గుండా మడకశిర మండలం గుండుమాల తండాకు చెందిన కుమార్‌నాయక్ మద్యం ప్యాకెట్లను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు కాపాడుదాం

హిందూపురం టౌన్: రక్తదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి, అత్యవసర

సంక్షిప్త సమాచారం

పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడుదామని వక్తలు పిలుపునిచ్చారు. ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో టిప్పుసుల్తాన్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, వన్‌టౌన్ సీఐ ఈరన్న, ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ, ఎంఈఓ గంగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలకు పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ మతసామరస్యానికి టిప్పుసుల్తాన్ పెద్ద పీట వేశారని, పీడిత వర్గాలకు సమానత్వం కల్పించాడన్నారు. కార్యక్రమంలో ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్, మైనార్టీ నాయకులు ఉబేదుల్లా హుసేన్, అజ్మతుల్లా, అస్లాం, అలీబాయ్, దండోరా ఆంజనేయులు, ఆశీష్ మండల్, రాజేష్, బసిరెడ్డి, నౌషద్ పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకూ ప్రజాసేవ

- మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి


మాట్లాడుతున్న కుమారస్వామి

పావగడ: తన ప్రాణం ఉన్నంతవరకూ ప్రజా సేవ చేస్తానని జేడీఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. గురువారం స్థానిక గురుభవన్ మైదానంలో నిర్వహించిన జేడీఎస్ భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సారి ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీతో గెలిచి జేడీఎస్ పార్టీ అధికారంలోకి ఖాయమన్నారు. తాను సీఎం అయిన తక్షణమే పంచరత్న ప్రణాళికలో రూపొందించిన పథకాలతో పాటు ఏడాదికి 5 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేలు చొప్పున 10 ఎకరాల వరకు పంటల సాగుకు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. భూముల్లేని నిరుపేదలకు నెలకు రూ.2 వేలు సాయం అందిస్తామన్నారు. ఇళ్లులేని పేదలకు రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు ఉచితంగా నిర్మిస్తామన్నారు. వితంతువులు, వికలాంగులకు నెలకు రూ.5 వేలు అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్పను అధిక మెజార్టీతో గెలిపిస్తే మంత్రిని చేస్తామన్నారు. పావగడలో ఉన్న పేదరికాన్ని పంచరత్న పథకాలతో పారదోలుతామన్నారు. తిమ్మరాయప్ప మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించి, రాష్ట్రంలో జేడీఎస్ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలన్నారు. అంతకు ముందు జేడీఎస్ నాయకులు ఎస్కే రెడ్డి, ఆర్సి అంజినప్ప, చన్నమల్లయ్య, సాగడు వెంకటేశ్ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్పను తూర్పారబట్టారు. తాలూకాలో ఆయన ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, సోలార్ ప్రాజెక్ట్ అప్పటి ఎమ్మెల్యే తిమ్మరాయప్ప హయాంలో వచ్చిందన్నారు. ఈ సారి ఎన్నికల్లో వెంకటేశ్ చిత్తుగా ఓడి పోతాడని జోస్యం చెప్పారు.

ప్రశాంతంగా జీవించాలి

రొద్దం: గ్రామాల్లో ప్రజలు గొడవలు, ఘర్షణలకు తావ్వికుండా ప్రశాంతంగా జీవించాలని సీఐ కరుణాకర్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గొడవలతో జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరి సంస్కృతి వారు పాటిస్తారని, ఇతరులు వాటిని అడ్డు తగలరాదన్నారు. ఇటీవల ఆర్ లోచెర్లలో ఓ వర్గం ప్రజలు కార్యక్రమం నిర్వహిస్తుండగా మరో వర్గం వారు అడ్డుకున్నారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. నిరుపేద విద్యార్థుల చదువుకు సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరశైవులు అన్ని రంగాల్లోను రాణించాలి

లేపాక్షి: వీరశైవులు అన్ని రంగాల్లోను రాణించాలని, వీరశైవులు ఐక్యత సాధించిన రోజే ప్రభుత్వాలు గుర్తిస్తాయని తెలంగాణా రాష్ట్ర బసవతత్వ ప్రచారకుడు మడపతి అన్నారు. గురువారం లేపాక్షిలో బసవ జయంతి ఉత్సవాలు సంఘం ప్రతినిధులు నళినాక్షి, విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన బసవన్న చిత్రపటాన్ని కారుపై ఉంచి వీరభద్రస్వామి దేవాలయం నుంచి నంది విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమాశానికి ముఖ్యఅతిథులుగా హిందూపురం మార్కెట్ మాజీ చైర్మన్ కొండూరు మల్లికార్జున, హిందూపురం పట్టణ అధ్యక్షుడు వీరభద్రప్ప, కర్ణాటక రాష్ట్ర బసవతత్వ ప్రచారకుడు సచ్చిదానంద ప్రభు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వీరశైవుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలన్నారు. అనంతరం 'బసవేశ్వర వచనామృతం' పేరుతో తెలుగులో రాసిన బసవన్న వచనాల పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భద్రావతి అక్క మహాదేవి, సంఘం సంచాలకుడు బసవరాజయ్య, వీరశైవలింగాయత్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, స్థానిక నాయకులు సూర్యప్రకాష్, శివకుమార్‌తదితరులు పాల్గొన్నారు.